# దొంగలు

—దేవరాజు మహారాజు

ఇంద్ర భవన్ ! అది స్వర్గం లో లేకపోయినా, దేవతలు, అప్సరసలు వగైరాలు వుండక పోయినా, దాని యజమాని ఇంద్రుడు కాకపోయినా, దాని పేరు ఇంద్రభవనే ! ! కాదనడానికి ఎవరికీ గుండెల్లేవ్. కాని పేరుకు తగ్గట్టుగా లేదు ఆ హోటల్ — అని అనడానికి అందరికీ గుండె వుంటుంది. ఆ మాట కొస్తే మనుషుల్లో పేరుకు తగ్గట్టు, ఎందరుంటారు ?

వై. యం. సి. ఎ. సెంటర్లో వున్న ఇంద్రభవన్ ఎదురుగా కేఫ్ కాస్మోస్ వుండడం, అందులో హై.పి. వుండడం. వాడు సరికొత్త హిందీ పాటలు ఎప్పుడూ ప్రయోగిస్తూ వుండడం, పరోక్షంగా ఇంద్రభవన్ కు దెబ్బ. ఆ కేఫ్ ప్రభావం నుంచి తప్పించి, ఎలా జనాన్ని ఆకర్షించాలి ? హోటల్ నెలా వృద్ధిచేసుకోవాలి ? అని చాలా సీరియస్‌గా ఆలోచిస్తుంటాడు హోటల్ ఓనరు. ఈ ఆలోచన పదేళ్లుగా చేస్తూచేస్తూ బట్టతల చేసుకున్నాడు. హోటల్‌కు, కేఫ్‌కు మధ్యన విశాలంగా రోడ్డు-రోడ్డు మీద నగరానికి, నాగరికతకు సంకేతంగా వాహనాల రొద....

ఘీంకరిస్తూ, ఏనుగులా పరుగెడుతున్న 'డబుల్ డెక్' లోంచి కేఫ్‌ముందు దూకేశాడు జాన్. కొంచెం సంబాళించుకుని, నిలబడ్డాక, పూల శర్టును మింగేసిన గళ్ళప్యాంట్‌ను నడుంవద్ద సరిచేసుకుంటూ, ఎదురుగా హోటల్ లోకి—యిటు కేఫ్‌లోకి నల్లకళ్ళద్దాల్లోంచి పరిశీలనగా చూసి, ఆ తరువాత కేఫ్ గడియారంలోకి చూసి, "ఏడున్నరయినా గాని పెంటిగాడింక రాలేదేంది?"—అనుకుని కేఫ్ ప్రక్కనే వున్న కిళ్ళీకొట్టు దగ్గరికి "ఒక చార్మినార్ సిగ్రెట్ యన్న" అంటూ వెళ్ళి కొనుక్కుని అంటించుకుని నాలుగైదు దమ్ములు పీల్చేసరికి....చిరునవ్వు దానంతట అదే వచ్చింది. పరిస్థితులన్నీ అనుకూలంగా కనిపించాయి ... కేఫ్ ముందు ఒక్క మంచి సైకిల్ అయినా లేదు. 'ఛీ' ఉమ్మేశాడు జాన్. హోటల్ ముందున్న సైకిళ్ళలో ఒకటి అట్లాస్, ఓ రెండు నార్టన్, తాళం కూడా వేసిలేని మరో కొత్త ఫిలిప్స్...ఆలస్యం చేయొద్దు అనుకుని, హుషారుగా రోడ్ క్రాస్ చేశాడు జాన్. హోటల్‌ముందు ఓ నిమిషంసేపు నిలబడి సిగరెట్ పొగ అదోలా విడిచి నింపాదిగా ఫిలిప్స్ సైకిల్ స్టాండ్ తీసి రోడుమీదికి మర్లించాడు. చక్రాలు తిరుగుతుంటే ఎండ రిమ్‌లపై పడి మెరుస్తుంది. నింపాదిగా సైకిల్నోసారి చూసి, తృప్తిగా నవ్వుకుని. ఎక్క

బోయేసరికి వెనకనుండి "చోర్ .... సైకిల్ చోర్—పకడో—" ఒకతను వేగంగా పరిగెత్తుకొస్తున్నాడు. జాన్‌కు గాబరా ఎక్కువైంది. అటుయిటూ ఆందోళనగా చూసాడు పరిగెడదామనుకునేంతలోనే వెనకనుంచిచేయిపడింది. జాన్ సైకిల్ విడిచేశాడు.'ధన్'మనిశబ్దం చేస్తూ పడిపోయిందది. "సైకిలెత్తుకపోతావుర నువ్" - ఓ చేతిలో కూరగాయల సంచి, మరో చేత్తో జాన్ పూలశర్టు నలిపేస్తున్నాడు, పట్టుకున్న ముసలాడు.

మంది ఎక్కువయ్యే సూచనలు కనిపించగానే, పట్టుకున్న వ్యక్తితో పెనుగులాడాడు. వీపుమీద రెండు తగల్నిచ్చాడు - జాన్.

ఆ దృశ్యం అందరూ చూస్తూనే వున్నారు. కాని కొందరుమాత్రం విడిపించడానికి వస్తున్నారు. అక్కడే సెంటర్లో మరోవైపు వున్న పోలీస్ స్టేషన్ కిటికీ లోంచి, లోపల సబ్ ఇన్‌స్పెక్టర్ గుర్రు పెడుతూ నిద్రపోయినట్టు స్పష్టంగా కనిపిస్తోంది. చెత్తకుండీలోది ఏమేం తిన్నదో అరగడానికి ఓ పంది బయటి కిటికీ క్రింద గోడకువళ్ళు రాచుకుంటోంది.

పోలీస్ స్టేషన్ ఎదురుగా మర్రిచెట్టు క్రింద, అరుగుమీద టోపీ చేతిలో పట్టుకుని నెత్తి - గోక్కుంటూ ఒకడు, పళ్ళన్నీ బయటపెట్టి మరొకడు - కానిస్టేబుల్స్ వున్నారు.

"ఇంకెందరి సైకిళ్లు కొట్కపోతవ్‌బే విన్ను పోలీస్‌కిస్త"-అంటూ ఏడుస్తున్నట్టు గర్జిస్తున్నాడు, జాన్‌ను పట్టుకున్న బక్కపల్చటి మనిషి. కొట్లాడే సత్తువలేదు. అందుకే జాన్ తోసేస్తే రోడ్డుమీద పడి సైకిల్‌ను పట్టుకున్నాడు. అతను లేవకముందె అతని జేబులు సర్ది పర్స్ తీసుకుని జాన్ పరిగెత్తబోయేసరికి, చోర్ .... చోర్ — అని కేకలేస్తున్నాడు లేవలేక ఆ ముసలాడు. అప్పటికే ఒకరిద్దరెవరో రిక్షావాళ్ళు జాన్‌ను పట్టుకోడానికి ప్రయత్నించారు. "నద్మ మీకెందుకుబే"-అంటూ బలంగా డొక్కల్లో పొడ్చేసి, అప్పుడే సెంటర్ తిరుగుతున్న బస్సును పరిగెత్తి అందుకున్నాడు - జాన్.

మూగిన వాళ్ళలో ఓ యిద్దరు ముసలాణ్ణి లేపారు. సైకిల్‌ను నిలబెట్టారు. అప్పటికే సంచిలోంచి రోడ్డు మీదపడ్డ కూరగాయలు రిక్షాల, బస్సుల చక్రాల క్రింద పడి నలిగిపొయ్యాయి లేచి, కుంటుతూ నడుస్తున్న ముసలాడి కాలి నుండి రక్తం కారుతోంది. ఏడ్పు గొంతుతో గొణుక్కుంటూ కూరగాయ లేరుకుంటున్నాడు. జేబు మళ్ళీ మళ్ళీ చూసుకుంటూ తిడుతున్నాడు.

హోటల్ నుండి ఆలస్యంగా బయటికి వచ్చిన వాళ్ళల్లో ఒకతనికి ఆదుర్దా ఎక్కువైంది. సైకిల్‌ను పరీక్షించి చూస్తూ—

"ఇది...నా సైకిల్_ ఏమిటి ?... ఏమైంది ?"-అని అడిగాడు దిక్కులు పరిశీలిస్తూ ప్రేక్షకుల ముఖాలు చదువుతూ—

"ఇంకేమయితది ? నాది నసీబ్ బాగలేదు పొద్దాల పొద్దాల ఎవ్వలి మొఖం సూశినొ్నా సావదెబ్బల్దిన్న....

పైసల్పాయే"

"నీ పైసలా ?-ఎలా పొయ్యాయ్"

"ఆడొకడున్నడు. అన్కి పన్లేదు పాటలేదు. సైకిల్లెత్కపోతాడు ఆన్నిది వరకు సూశిన. అందేక్క గీ సైకిల్ దీసొంటి.యిదేదోదొంగపనే వుందనిపట్టు కున్న. గంతే - నన్ను బగ్గదన్ని. సైకిలిడిసి, నా పర్సు కొట్కపోయింఁడా జొఁడ్కవ్. అండ్ల పదిహేఁ రూపాయ లుండె .... ఆడు నన్ను దోస్కపోయిండు. ఆ నమ్మకద్రొగాల. పూటకు లేనోన్ని నన్ను దోస్కుంటే మొసది ? మొన్ననే జీతమెత్తితి. మల్లపైలి ఇయ్యాల్లోసదా? రేపొస్తదా? యిర్వయి రోజుల్లావాలె...."- దీనంగా ఏడుస్తున్నట్టు చెబుతున్నాడు ఆ ముస లాడు. అవునన్నట్లు హోటల్ ముందు వాళ్ళందరూ తలలూపుతున్నారు. ముస లాడు. నడుమంతా వత్తుకుంటున్నాడు. ఆయాస పడున్నాడు. నెత్తికొట్టుకుంటు న్నాడు. మంచి చేయబోతే కీడు కలి గిందే- అని అందరూ విచారిస్తున్నారు.

లోతు కళ్లు, వాటి నిండా నీళ్లు, గొంతులో పది రకాల జీరలు !! నెత్తి మీద వెంట్రుకలు నిఃబడినా కొన్ని తెల్లబడి వున్నాయ్. ముడతలుపడ్డ చొక్కా చేతుల్లోంచి సన్నగా జారిన చేతుఁా, పైకి కట్టిన గళ్ల లుంగీలోంచి పొడుచుకొచ్చి, వణుకుతున్న బలహీన మైన కాళ్ళూ .... సైకిల్ ఓనరుకు జాలి కలిగింది.

"యిదిగో పది రూపాయలు తీసుకో-నువ్వన్నట్లు పదిహే నిచ్చేవాణ్ణే. కాని ఇప్పుడు జేబులో లేవు...."

"ఆఁ...రూపాయలా ? - నువ్వెందు కి సవ్ సాబ్. ఆ దెవడో కొట్క పోయిండు." — చెయ్యి చాపినట్టు చేస్తూనే అన్నాడు.

నా సైకిల్ చేయబట్టి కదా నీ పర్సు పోయింది. నువ్వు పట్టుకోబట్టి సరి పోయింది. పరవాలేదు. తీస్కో". వణుకుతూ ఇచ్చాడు.

వణికే చేయితో తీసుకున్నాడు - నమస్తే పెట్టాడు.

రోడ్డుమీద లారీతో కొట్టుకుంటూ, పోలీసు వాళ్ళొచ్చారు.

"క్యాభై క్యాహోరై ( —ఆ( —" గదమాయించాడు ఒకడు ముఖం చిట్లించుకుని. సైకిలతను వెళ్ళి పొయ్యాడు.

"దొంగల్వడ్డంక ఆర్నెల్లకు కుక్క ల్మొరిగినట్లు. గిప్పు దొస్తాండ్రు సూడు"-కాలి రక్తం తుడుచుకుంటూ అన్నాడు ముసలాయన .... కొందరికి జోక్‌లాగ అనిపించిందేమో చుటున్న కొందరు నవ్వారు కొందరు వాళ్ళను హేళనగా చూసారు. పోలీసులకు చిర్రెత్తుకొచ్చింది.

"ఏంది? ఏమైతాం దీద"-గద్దించాడు మరొకడు.

"అయ్యేదేంది, గోర్నమెంటుకూసో వెట్టి, మీకు బొద్దెల్వెట్టి, మేపుతాంది."- ఉక్రోషమంతా ముసలాడి మాటల్లో కక్కుకున్నాడు. వాళ్ళ మోహం చూడ కుండానే అక్కడ్నించి కదిలాడు

"క్యాబే దమాఖ్ ఫిరె క్యా. సీదా బాత్ కల్..." అంటూ కర్ర మీదికెత్తి గాండ్రించాడు పోలీసతను.

"ష్ష్...ష్ష్...ఓఓయ్.... ఆయన్నే మనక్..." అన్ని దిక్కుల్నుండి వారింపులు వినవచ్చాయ్ "ఈ దేడ్ దమాఖ్‌గాల్లకు మంచోడెవడో చెడ్డోడెవడో తెల్వదు" – ఎవరో అన్నారు. అసలు సంగతి అర్థం కాక, ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు పోలీసోళ్ళు. పరాభవించబడినందుకు ఒకడు ఫుట్‌పాత్‌ను గట్టిగా కొట్టాడు. మరొకడు టోపీ తీసి నెత్తి గోక్కున్నాడు. ఒక్కొక్కరే విడిపోవడం మొదలెట్టారు.

"ఎహేఁ– అబ్ ఆయా ఫేస్‌లా కర్‌నేకు...థూ ..." అని ఫుమ్మేసి,నవ్వి వెళ్ళిపోయాడు ముసలాడు. విషయమేమిటో తెల్సుకుందామని హోటల్ ఓనరు దగ్గరికి వెళ్లారు పోలీసు వాళ్ళు.

* * *

"ఛిచ్.... ఛిఛిచ్... ఓరి పెంటిగా" కేక, చప్పట్లు, వినిపించి చుట్టూ చూసాడు ముసలాడు. నారాయణగూడ బ్రిడ్జి గోడమీద కూర్చుని వున్నాడు జాన్. ఈసారి అతన్ని చూడగనే.చోర్ ....చోర్... అనలేదు. స్నేహితుణ్ని చూసిన సంతోషంకలిగింది. వళ్ళు పులకరించింది. అవసరం వున్నప్పుడల్లా రకం కారడానికి, వానిపోనివ్వకుండా కాపాడుతున్న కాలి పుండుకు, కట్టిన గుడ్డ జారిపోతే, సరిచేసుకుని మరింత బిగించాడు. రోడ్ క్రాస్ చేస్తూ, అతని వైపు వడివడిగా అడుగులేసాడు.

"హోటల్ ముందు పడప్పుడు లే పేటందొక్కచ్చిన యిద్దట్ల, సూసే - ఒకనెగ్గర్నే పర్సు దొరికింది. ఇంకోని దగగ పర్సేలేదు—"అనుకుంటూ నవ్వుకున్నాడు ముసలాడు.

వసున్న ముసలివాణ్ణి చూసి, సంతృప్తితో 'గింతసేపాబే'– అంటూ వాటి జేబులోంచి. ఇందభవన్ ముందు తిసిన ఖాళీ పర్సు వెనక జేబులోంచి తీసి యివ్వడానికి సిద్ధంగా పట్టుకున్నాడు - జాన్.

"సికింద్రాబాద్ ఆల్ఫా ఓటల్ కాడిక్కపోదాంపారా" అని అందామని అనుకుంటూ కౌగలించుకున్నంత పని చేసాడు ముసలి పెంటిగాడు.

---

*"అనామికతో ముఖాముఖి" శీర్షికక్రింద పాఠకుల ప్రశ్నలకు ప్రత్యుత్తరాలు ఇవ్వబడుతాయి. పాఠకులు తమ ప్రశ్నలను అనామిక ఎడిటర్ పేరిట పంపగలరు*

---

*త్వరలో—*

## ప్రఖ్యాత కథకులు

# శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రిగారి

## సీరియల్ కథ